


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఏమైపోతున్నాం?

**ఇప్పుడు అందరి** దగ్గరా డబ్బులుంటున్నాయి. కోరినవి కొనుక్కుతింటున్నారు. చిన్నప్పుడలా కాదు. చాలా బీదరికం వుండేది చుట్టూ. మీరు 60, 70లలో నవలలు, సినిమాలు చూడండి. అతుకులు వేసిన బట్టలు కట్టుకునేవారు శరీరాన్ని కప్పుకోడానికి. మందుసీసా కోసం రూపాయి డబ్బులు లేక 'ఖళ్...ఖళ్' మని దగ్గుతూ ముసలితాతా, తెగిన చెప్పుకి పిన్నీసు పెట్టుకునే తండ్రీ, గిన్నెలో అన్నం మిగలకపోతే, నీళ్ళు తాగి పడుకునే తల్లీ, పరీక్ష ఫీజు కట్టడానికి పది రూపాయలు లేని హీరో. పచారీ షాపులో అరువు కోసం వెళితే హీరోయిన్‌తో "కాసుకి లేని వాళ్ళకి నీతి ఎందుకు?" అని వెకిలి మాటలు మాట్లాడే విలన్‌లూ, ఇంటద్దె కట్టలేని హీరో, మేడమీదకి రహస్యంగా నిచ్చెనమీద వెళ్ళడం, రైల్లో వెళ్తుంటే వున్న రెండురూపాయలూ పిక్ పాకెటర్ కొట్టేయడం, కట్నం ఇవ్వలేక అక్క పెళ్ళి పందిట్లో ఆగిపోవడం, బజ్జీలు అడిగిందని షాపు వాడు పసిదాని చేతిమీద అట్లకాడతో వాత పెట్టడం... అమ్మో బీదరికాన్ని నాలుకలు చాపుతూ చూపెట్టేవారు.

అందులో ఒక సినిమా 'మనుషులు మారాలి' అయితే, ఇంకోటి కొంచెం పెద్దయ్యాక చూసింది 'జీవితరంగం', తర్వాత 'సంసారం సాగరం' కూడా. ముఖ్యంగా ఈ బీదరికాలకి అప్పట్లో కారణం ఫ్యామిలీ ప్లానింగ్‌లు లేకపోవడం. మా చిన్నప్పుడు సీతయ్య తోటలో ఒక కాంపౌండ్‌లో గుండ్రంగా చాలా ఇళ్ళుండేవి.

ప్రతి ఇంట్లో ఐదుగురు పిల్లలో, లేక అంతకన్నా ఎక్కువో వుండేవారు. "ముతకో సతకో నాలుగు చీరలూ, నలుపో తెలుపో నలుగురు బిడ్డలు' వుండాలని అప్పటి పెద్దల మాట. అందుకే ఒక్కడు సంపాదిస్తుంటే, ఇంట్లో ఏడెనిమిది మంది తినాలంటే డబ్బులు సరిపోయేవి కావు మరి. ఈ రహస్యం వారికి తెలీక అంతమంది పిల్లల్ని కనేవారో తెలీదుకానీ, సందానీ వాళ్ళ బువా ఎప్పుడొచ్చినా పెద్దకడుపేసుకుని, వెనక నలుగురూ, తర్వాతేడు ఐదుగురూ, అలా పెంచుకుంటూ పిల్లల్ని వేసుకునొచ్చేది. మొగుడు పిండిమర ఆడేవాడు. ఎప్పుడైనా వస్తే నెత్తినుండీ, కిందదాకా పిండి కొట్టుకుపోయి, పెళ్ళాంతో దెబ్బలాడ్డానికో, బావమరిదిని డబ్బులడగడానికో వచ్చేవాడు. అతని అసలి మొహం ఎలా వుంటుందో ఆ పెళ్ళాం కైనా తెలిసో లేదో మరి.

సందానీ తల్లి "మళ్ళీనా?" అని ఆడబిడ్డ కడుపు చూసి తల పట్టుకునేది. ఇంట్లో ఇంకో ఆరు కడుపులు నింపమని తయ్యారయ్యేవి. సందానీ మాత్రం గొప్ప ఆశావాదంతో "పెద్దగయినంక నేను హోటల్ పెడితే నాకీ అత్తకీ పిల్లలూ, నాకీ తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ అందులో పనిచేస్తయి. పప్పు రుబ్బుతయి, కాఫీ, టిఫిన్లు అందిస్తయి, గల్లా పెట్టి తాన కూసుంటయి" అనేవాడు.

"హోటల్ల చేసిన టిఫిన్లు అన్నీ తింటయి" అని నేను వెటకారంగా అనేదాన్ని.

అమ్మమ్మ "మున్నీ.. ఆ రుక్సానాకి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించండే గవర్నమెంట్ ఆసుపత్రిలో ఫ్రీగా చేస్తారు" అని చెప్పేది.

రుక్సానా ఈ మాట మొగుడితో అనగానే, పిండిమర ఆపు చేసి మరీ "అల్లా కా దేన్‌ని వద్దటావా?" అని తన్నేవాడు మొగుడు, సందానీ తల్లి "నువ్వు ఇంక నీ మొగుడు తానకి పోకే తల్లీ.. ఇంక దేన్ చాలు" అని బాధపడేది. రోట్లో పల్లీలూ, మిరపకాయలూ, చింతపండూ వేసి, తన కన్నీళ్ళతో కలగలిపి ఎర్రకారం నూరి ఇన్ని పొట్టలు నింపాలని చూసినా నిండేవి కావు.

సందానికి మాత్రం క్రికెట్ ఆడ్డానికి గ్రౌండ్ తప్ప బయట ప్లేయర్స్ ఎవరూ అవసరం పడేవారు కారు.

ఆ రోజుల్లో ఇంటెడు పిల్లలతో కడుపులు ఎలా నిండేవని ఆలోచించేవారు అందరూనూ. ఈ రోజుల్లో కడుపులు ఎలా మాడ్చుకోవాలని రకరకాల పద్ధతుల ద్వార ఆలోచిస్తున్నారు అందరూనూ.

"మేం కార్బ్స్ తినము. అసలు అన్నం అనేదే నెలకోసారి. షుగర్ అసలు తెప్పించడమే మానేసాం. డీప్ ఫ్రైడా? అమ్మో! నెయ్యి వేసుకోడమా! అమ్మో గుండె ఆగిపోదూ, కొలెస్ట్రాల్!" అనే, ఎవరి మాటలు విన్నా కూడా.

అప్పట్లో తినడానికి వుందా లేదా? అదొకటే సమస్య. ఇప్పుడు "ఏం తింటే ఏం సమస్యో?" అని రకరకాల సమస్యలు.

సెలవులకి ఏ పెద్దమ్మగారి ఇంటికో వెళ్ళేవాళ్ళమా? రైల్లో భలే సరదాగా వుండేది. అమ్మమ్మ క్యారియర్లో తెచ్చిన ఆవకాయన్నం, పెరుగు అన్నం పెట్టేలోపే, మసాలా వడలూ, గోల్డ్‌స్పాట్‌లూ, నారింజ తొనలూ, బిస్కెట్ ప్యాకెట్లులూ బోలెడు కొనిపించేవాళ్ళం పెద్దవాళ్ళ ప్రాణాలు తీసి. కాళ్ళూ చేతులూ బాదుకుంటూ, అవసరమయితే జుట్టు పీక్కుంటూ "నా కది కావాలి" అని పిల్లలు ఏడుస్తూవుంటే అమ్మే వాళ్ళు ఒకంతట కదిలేవాళ్ళేకాదు. ప్రయాణం అంటే మరచెంబులు విప్పడం, అందులో వుండే చిన్న గ్లాసుతో మంచినీళ్ళు తాగడం, తెచ్చుకున్నవి రైలు కదలగానే తువ్వాలు పరుచుకుని, బాదం ఆకుల్లోనో, ప్లేట్లలోనో పెట్టుకు తినెయ్యడం, మళ్ళీ స్టేషన్ వస్తే 'ఇడ్లీ, వడా" అని అమ్మేస్తే కొనుక్కోడం. కొంతమంది కాఫీలూ, చాలామంది మగాళ్ళు సిగరెట్లు తాగడానికే రైలు ఎక్కుతారేమో అనుకునేదాన్ని.

మా అక్కలైతే ఎక్కినప్పటినుండీ వారపత్రికలు కొనుక్కుని చదువుతూ వుండేవారు. ఇళ్ళల్లో కూడా సామూహిక పఠనంలా ఒకే పుస్తకంలో రెండో మూడో తలలుండేవి. "పేజీ తిప్పనా" అంటే "ఒద్దొద్దు" అనేవారు.

సరే ప్రయాణం అయి ఏ రిక్షానో, జట్కానో కట్టుకున్నా, ఆ బండిలో పిల్లల్ని సూట్‌కేసులో బట్టలూ, సంచిలో కూరగాయలు కూరినట్టు కూరేవారు. ఏ ఇంట్లోనూ నలుగురికి తక్కువ పిల్లలు అసలుండేవారే కాదు.

ఇంక సందానీ బువా పిల్లలూ, వాళ్ళూ కలిసి ఏ కడప పెద్ద దర్గానో వెళ్తుంటే "నసీం, అక్రమ్, సలీం, జుబేదా, మెహర్, బడా అఫ్సర్, చోటా అఫ్సర్, బడా షహీన్, చోటా షహీన్" ఇలా లెక్కపెట్టడం రాక తలలన్నీ లెక్కపెట్టలేక, ఒకే రంగు తాను చింపించి అందరికీ చొక్కాలు కుట్టించి, వాళ్ళని ఆటో ఎక్కిస్తే, ఆటోవాడి అటు పక్క ఒకడ్ని, ఇటు పక్క ఒకడ్ని, వీలైతే ఒళ్ళో ఒకడ్ని, వెనుక సీట్లో రెండు వరసల్లో పెద్దవాళ్ళు నలుగురు, ఎదురుగా చెక్కమీద నలుగురూ, బయట వైపుకి వున్న రాడ్‌మీద చెరొకరూ, పన్నెండు సంఖ్యకి తక్కువ కాకుండా ఆటోలో కుక్కి తీసుకెళ్ళేవారు. ఇంక వీళ్ళందరికీ తిళ్ళు సిల్వర్ క్యాన్‌లలో ఏదో ఆకుపచ్చ కూరా, అన్నం, లేదా పెద్ద పెద్ద రొట్టెలూ, ఎర్రకారం, మహా కొంటే రెండు మోడ్రన్ బ్రెడ్ పాకెట్లు . ఇవన్నీ తినేసి ఆ పిల్లలు అమ్మనీ నాన్ననీ కూడా తినేద్దామా అన్నంత ఆకలి మీద వుండేవారు.

ఇదే తంతు ఆస్పత్రుల్లో కూడానూ. ఓ పేషెంటుండేవాడు మంచం మీద చారల చొక్కాతో, ఎగశ్వాసా, దిగశ్వాసతో. కింద ఓ నలుగురు బట్ట పరుచుకుని నలుగురు వెండి చెంబులతో నీళ్ళు పెట్టుకుని పింగాణీ ప్లేట్లలో పప్పుచారూ అన్నం తింటూ వుండేవారు. వచ్చిన

వాళ్ళంతా దూరాలనుండి వస్తారు కదూ మరి. అందుకే రాగానే పేషెంట్‌ని ఓ మారు 'ఉన్నావా?' అని అడిగేసి, కింద సెటిలైే తిళ్ళు తినేవారు. పోయేవాడు పోతాడు. ఉన్నవాడు కడుపు నింపుకోవాలిగా మరి.

ఇంక చుట్టాలింటికి వెళ్ళామా, వాళ్ళు కూడా పెద్ద మర్యాదలు చేసేవాళ్ళు కారు. "రండి.. చద్దన్నం ఆవకాయ వేసుకుని తినేయండి. ఈలోగా వేడిగా వంట చేసేస్తాను" అనేవాళ్ళు.

మా పెద్దమ్మ అయితే పెరట్లో దొండకాయలన్నీ కోసుకురమ్మనేది. గొప్ప వుషారుగా మేం ప్రతి మొగ్గా కోసేసేవాళ్ళం. లేత దొండకాయ వేపుడూ, ఘుమఘుమలాడే పప్పుచారూ, ఊటలో ఆవకాయి ఎంత బావుండేదో. తరువాత 'వాళ్ళ చుట్టాల పిల్లలు వాళ్ళకి పనిచెప్పకూడదు' అని కూడా వుండేది కాదు. ఎంగిళ్ళు తీయడం, పెరట్లో తోమెయ్యడం, బట్టపెట్టి వంటిల్లు తుడవడం, బట్టలు వుతుక్కోడం, ఆరిన బట్టలు తెచ్చి మడతెయ్యడం, రెండుపూటలా బియ్యం ఏరడం, కూర తరగడం, ఇళ్ళు తుడవడం, రాత్రి పక్కలు వేసేదాకా "ఇది నీ పనీ ఇది నీకూ" అని డ్రిల్లు టీచర్ల పనులు అమ్మమ్మ పని అప్పగిస్తూనే వుండేది. కానీ మధ్యాహ్నాలు మాత్రం అందరి పిల్లలం గచ్చుమీద బలపాలతో అష్టాచెమ్మలు గీసుకుని ఆడుకోడమో, చింతపిక్కలూ, లేదా పేకాటాలాంటివో ఆడుకోడం భలే బావుండేది. అప్పుడప్పుడూ తీసుకొచ్చే మిరపకాయ బజ్జీలూ, మిఠాయిలూ, పండ్లూ అందరికీ పంచి ఇచ్చేవారు. మా పెద్దక్కలు, అన్నలూ కొన్నిసార్లు "మా వాటా ఆ ఆఖరి వాడికిచ్చేయండి.. ఆ చిన్నదానికిచ్చేయండి" అని గొప్ప దాతృత్వం చూపేవారు.

సందానీ కుటుంబాలలాంటివి మా కాలనీ చుట్టూ చాలా వుండేవి. వాళ్ళకి ఏ పూటా 'కంచంలోకి ఎలా? అని తప్పిస్తే కంచంలోకి ఏవిటి? ' అనేది ముఖ్యం కాదు పాపం. రోగం వస్తే ధర్మాసు పత్రీ, ఎక్కడికైనా వెళ్ళాలంటే ఆర్.టీ సీ బస్సూ వుండేవి. ఆరుబయట మంచమో, జంబుఖానానో పరుచుకుని ఆడవాళ్ళూ, పిల్లలూ, గొప్ప కులాసాగా పాటలు పాడుకుంటూ, ఏ బీడీలు చేసుకుంటూనో, పెద్దగా మాట్లాడ్తూ నవ్వుతూ వుండేవారు. మొగుళ్ళకి ఆదివారాలు, వీపులు రుద్ది తలంట్లు కూడా పోసేవారు. వున్న నాలుగు మేకల్లో ఒకటి దావతొస్తే పులావయ్యేది. వీళ్ళతో బాటే కోళ్ళూ, బాతులూ, మేకలు కూడా తిరుగుతుండేవి. పదేళ్ళు రాగానే పెద్దవాడు ఏ సైకిల్ షాపులోనో, పిండి మరలోనో పనిచేస్తూ కనిపించేవాడు. నలుగుర్ని కంటే ఎనిమిది చేతులూ సంపాదిస్తారని కనేవారేమో తెలీదు.

కింద వర్గాల వారు అలా వుంటే, మధ్యతరగతి వాళ్ళు మాత్రం. కథ చదవడం మొదలు పెట్టగానే, గంపెడు సంసార భారంతో కుటుంబరావు నడుములా అతను కూర్చున్న నవారు మంచమూ ఒంగిపోయింది. అలిమేలు రవికెకున్న చిరుగులా ఆకాశంలో చంద్రుడు కనిపిస్తున్నాడు. యవ్వనంలో వున్న కళ్యాణి ఒళ్ళు కప్పలేని చీరలా, మేఘం చంద్రుడితో దోబూచులాడ్తోంది. భరిణలో వున్న హారతి కర్పూరం పన్నెండుమంది పిల్లల్ని కన్న తాయారు ఆరోగ్యంలా హరించుకుపోయింది" లాంటి పోలికలున్న కథలు ఆడవాళ్ళు గొప్ప ఆసక్తిగా, కన్నీళ్ళు తుడుచుకుంటూ చదువుతుండేవారు.

తెగిన చెప్పూ, విరిగిన గొడుగూ, కోడు విరిగిన కుర్చీ, పట్టా చిరిగిన మడత మంచం, అద్దం జారిన కళ్ళజోడూ, కుట్లు విడిన పాతకోటూ, పాడయిన ఫ్యానూ, బరబరమని మోగే రేడియో, టైర్ పంక్చర్ అయిన సైకిలూ, బద్దలయిన హరికెన్ లాంతరూ ఇవన్నీ అప్పట్లో కష్టాలు, మరి ఇప్పుడో...

ఓ మనిషి బెడ్‌మీద పడుకుని వుంటే, ఆక్సిజెన్ ట్యూబ్‌లా వేలాడ్తూ వుంటుంది. సెల్‌ఫోన్‌కి చార్జింగ్ కేబుల్. అది వూడిందా ఈ ప్రాణం గతుక్కు.

ఎవరొస్తున్నారు? ఎవరు పోతున్నారు తెలీని 'డెలీరియం'లాంటి అపస్మారక స్థితిలో మనిషి అంతా మిధ్య. వైఫై ఒకటే శాశ్వతం. ఒకవేళ వైఫై లేకుండా 24 గంటలు గడించిందా! ప్రాణానికే ప్రమాదం. తన చుట్టూ వున్న నెట్‌ఫ్లిక్సూ, ఫేస్‌బుక్కూ, ఇన్‌స్టాగ్రామూ, ట్విట్టరూ, వీటిలో వీడియోలకే నవ్వుతాడు. స్పందించి ఆవేశంగా కామెంట్స్ పెడ్తాడు. చలించి కన్నీళ్ళు పెడ్తాడు. పక్కన తల్లి 'మీ నాన్నగారికి హార్ట్ ఎటాక్ వచ్చిందిరా?' అంటే "అమ్మా.. ఈ ఒక్క కామెంటూ పెట్టి వస్తా" అంటాడు. అందులో 'బతకమ్మలు' చూస్తాం.

చిన్నప్పటి ఫోటోలు చూసుకుంటాం. మరిచిపోయిన మధురమైన వంటల రుచులని చూస్తాం. తాజా సౌగంధాలనిచ్చే పూలకి పరవశిస్తాం. ఉమ్మడి కుటుంబాలని కాలితో తన్ని, 'మా పెద్దనాన్నగారి బావమరిది మూడో కొడుకూ వాడి కుటుంబంతో మేము' అని ఫోటోలు పెడితే ఆ అనుబంధాలకి పులకరిస్తాం. ఫలానా హీరో పెళ్ళాం కారు డ్రైవర్‌కి కొత్త సెల్‌ఫోన్ కొనిచ్చిందని 'యూ ట్యూబ్'లో చదివి 'నువ్వు అన్నపూర్ణవి' అని కామెంటేస్తాం. ఎవరికో 'రాత్రి సడెన్‌గా కరెంట్ పోయింది. టీవీలో పెళ్ళి చూపులు మిస్ అయ్యాం' అంటే ఎంత కష్టం వచ్చిందీ అని ఓదారుస్తాం. వీధిలో తండ్రి స్కూటర్ దిగి 'బరువుగా వుంది ఈ కూరల సంచి అందుకోరా.. ఎవరైనా రండిరా' అంటే, చెవుల్లో ఇయర్ ఫోన్స్ దోపుకుని, వీలైతే తలుపు వేసేసుకుంటారు.

యూత్ ఏం చెయ్యాలో యూ ట్యూబ్‌లలో చూసి 'వహ్వా' అంటారు. ఏదైనా చెయ్యాలంటే వైఫై పోతే కానీ లేచే శక్తి లేక కూలబడతారు. ఇంటికి ఒక పిల్లాడూ, ఒక పిల్లా. ఐక్యాలోకి మొదటి రోజు వెళ్ళలేదని బాధ. కొత్తగా పెట్టిన సుబ్బయ్య హోటల్ ఫుడ్ తినకుండా పోతామేమో అన్నట్టు మొదటి రోజే బెంగ. అభిమాన హీరో సినిమా మొదటి ఆట చూసి పోస్ట్ పెట్టకపోతే సమాజం చిన్నచూపు చూస్తుందనే సిగ్గు. ఇన్నిన్ని కష్టాలు పంచుకునేవారు లేక నోరు విడిచి చెప్పలేక ఈనాడు జనం కష్టాల్లో వున్నారు.

ఆనాడు తిండిలేదు. ఈనాడు తింటే అరగదు. ఆనాడు ఇంటినిండా జనం. ఇప్పుడు వంటరితనం. అప్పుడు కడుపారా కబుర్లు చెప్పుకోడం ఆనందం. ఇప్పుడు కళ్ళముందు తెరమీదే ఆడ్తే తప్ప అర్థంకావు. ఆనాడు ఎండలో వానలో నడిచి తిరిగేవారు. ఇప్పుడు ఆకాశంలో, కార్లమీదా ఎగిరిపోతున్నారు. అప్పుడు అధిక జనాభా. ఇప్పుడు అధిక కాలుష్యం. "ఆ కాలంలో పక్కవాడి మాటా, బాధా ఆనందం పంచుకునేవారు. ఇప్పుడు వినడానికి టైం లేదు. తల ఎత్తాలంటే పైకి లేవట్లేదు."




Post your comments

https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

